క్లుప్తంగా

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా నరేందర్ నియామకం

సెంట్రల్ కో ఆర్డినేటర్ దాగిల్ల దయానంద రావు



తలారి నరేందర్‌కు నియామక పత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

తాండూరు టౌన్: బహుజన సమాజ్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా తలారి నరేందర్‌ను నియమించినట్లు ఆ పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్ దాగిల్ల దయానంద రావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నరేందర్‌కు నియామక పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన బహుజన రాజ్య స్థాపన కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం ఆశయ సాధన కోసం పాటుపడాలని సూచించారు. రాబోయే కాలం బహుజనులదేనని, యువత బహుజన వ్యవస్థ స్థాపనలో కీలక పాత్ర పోషించాలని పిలుపు నిచ్చారు. అనంతరం బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ ముదిరాజ్, గుండెల ధర్మేందర్ త్వరలోనే జిల్లా పూర్తి స్థాయి కమిటీతో పాటు అన్ని నియోజక వర్గాల కమిటీలు, సెక్టార్, బూత్ కమిటీలను నియమిస్తామని ప్రకటించారు.

జుంటుపల్లిలో ముగిసిన బహిరంగ వేలం



ఆలయ ఆవరణలో వేలం నిర్వహిస్తున్న సిబ్బంది

యాలాల: మండలంలోని జుంటుపల్లి రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఉత్సవాల్లో టెంకాయలు, లడ్డూ, పులిహోర వేలాన్ని శనివారం నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు నిర్వహించిన వేలంలో టెంకాయలు రూ.2.50లక్షలు, లడ్డూ, పులిహోర ప్రసాదానికి రూ.2.65లక్షలకు వేలం పాటలో భక్తులు దక్కించుకున్నట్లు ఆలయ చైర్మన్ శ్యాంసుందర్‌రావు, ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు. వీటితో పాటు ఆలయంలోని హుండీని లెక్కించగా రెండు నెలలకు గాను భక్తుల నుంచి రూ.47,157లు ఆదాయం సమకూరినట్లు వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



కరపత్రాన్ని విడుదల చేస్తున్న హిందూవాహిని, ఆర్ఎస్ఎస్ సభ్యులు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని సిద్దనొంపు పడమటి ఆంజనేయస్వామి వారి దేవాలయంలో శనివారం ఆర్ఎస్ఎస్, హిందూవాహిని, భక్తుల సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఇప్పటి వరకు నిర్వహించిన స్వామివారి హనుమాన్ చాలీసా పారాయణం నేటితో 78వారాలు పూర్తయ్యాయని వారు తెలిపారు. ఏప్రిల్ 12వ తేదీన వీర హనుమాన్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దనొంపు పడమటి ఆంజనేయ స్వామివారి దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఇష్టంతో చదవాలి

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ కెమిస్ట్రి డేవిడ్ విల్సన్



మాట్లాడుతున్న డేవిడ్ విల్సన్

కొడంగల్ రూరల్: విద్యార్థులు ఇష్టంతో చదివి సబ్జెక్టుపై అవగాహన పెంచుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ కెమిస్ట్రి ఎస్ డేవిడ్ విల్సన్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రి ఇంచార్జ్ హరిప్రియ, డాక్టర్ శ్రీధర్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ బి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఎక్స్‌టెన్షన్ ఆఫ్ గ్లూకోజ్ స్ట్రక్చర్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయకర్త టి.రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్భర జీవనం..!

- సకాలంలో జీతాలు అందక పంచాయతీ కార్మికుల ఆందోళన
- భారంగా కుటుంబ పోషణ
- నెలలు గడుస్తున్నా తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



హస్నాబాద్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న కార్మికులు (ఫైల్)

దుద్యాల్: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే గ్రామ పంచాయతీ కార్మికులు పనికి రాకుంటే ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. ప్రజలకు ఇబ్బందులు రాకుండా ప్రతిరోజు గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతున్న వారికి సకాలంలో జీతాలు అందడం లేదు. దీంతో వారి కుటుంబ పోషణ దుర్భరంగా మారినా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. పంచాయతీ కార్మికులకు నెలలు గడుస్తున్నా జీతాలు విడుదలకాకపోవడంతో కార్మికులు పడుతున్న ఇబ్బందులు అంతో ఇంత కాదు. తమకు జీతాలు సకాలంలో రాకపోవడంతో తమ కుటుంబ జీవనం ఎలా సాగించాలి సారు.. అని ప్రశ్నిస్తున్నారు.

ప్రతినెలా జీతాలు విడుదల చేయాలి

తమకు ప్రతినెలా సమయానికే జీతాలు విడుదల చేయాలని గ్రామ పంచాయతీ అధికారులను వేడుకుంటున్నారు. పెరిగిన నిత్యవసర సరుకుల, కూరగాయల ధరలను చూస్తే ఏమి తినలేని పరిస్థితి దాపురించింది. మరోవైపు పెరిగిన ధరలకు అనుగుణంగా తమ జీతాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఆలేడ్, హస్నాబాద్, దుద్యాల్, లగచర్ల, హకీంపేట్, చిలుముల మైల్వార్, చెట్టుపల్లి తండా, ఈర్లపల్లి తదితర అన్ని గ్రామాల్లో దాదాపుగా నాలుగు నుంచి ఐదు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని కార్మికులు చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా రెండు నెలల వేతనం కార్మికుల ఖాతాలో జమచేసేందుకు ఎస్‌టీవో కార్యాలయంలో అందుకు సంబంధించిన బిల్లులు ఉన్నాయని, మరికొన్ని గ్రామ పంచాయతీ కార్మికులకు విషయంలో మండలం మారడంతో కొత్త ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వివరణ ఇచ్చారు. గ్రామ పంచాయతీ కార్మికులకు అందేది అరకొర జీతం. ఇవి నెలల తరబడి పెండింగ్‌లో ఉంటే కుటుంబ పోషణ కష్టంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయంలో జీతాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో తమ జీతాలు అందేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చెత్తను తొలగిస్తున్న కార్మికులు (ఫైల్)

జీతాలు లేకున్న నిత్యం విధులకు..



కొన్ని నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ జీవనం చాలా ఇబ్బందిగా మారింది. జీతాలు లేకున్న నిత్యం విధులకు హాజరవుతున్నాం. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నాం. ఉగాది పండుగ వస్తుంది. జీతాలు రాకపోతే పండుగ ఎలా చేసుకోవాలి. తక్షణమే అధికారులు స్పందించి జీతాలు ఇవ్వాలి.

– లక్ష్మీ , పంచాయతీ కార్మికురాలు, హస్నాబాద్

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తాం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాలి శివకుమార్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శివకుమార్‌రెడ్డి

దోమ: ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాలి శివకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులను పాఠశాల ఎస్ఓ చైతన్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. ప్రతీ పాఠశాలలో నూతన భవనాలు, సీసీ రోడ్లు, బాత్‌రూమ్‌లు, ప్రహరీలను నిర్మించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందుకు ఉపాధ్యాయులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జాకటి వెంకటయ్య, ఇందిరమ్మ గ్రామ కమిటీ మెంబర్ వెంకట్‌రాం, మల్లేశ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షాహీద్, నవీన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సీఐటీయూ, బీసీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్



అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న కార్మికులు

మర్పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ, బీసీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ ప్రభుత్వాన్ని కోరారు. హక్కుల సాధన కోసం హైదరాబాద్‌లో చేపట్టిన శాంతియుత నిరసనకు ఆయా గ్రామాల నుంచి వెళ్తున్న కార్మికులను ప్రభుత్వం అరెస్టు చేయించడాన్ని నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ మీదుగా కోట్‌మర్పల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అనంతరం కోట్‌మర్పల్లి చౌరస్తా వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ మైపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐటీయూ, బీసీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులకు, వ్యవసాయ ఇతరత్ర మార్కెట్‌లలో కూలీ పనులు చేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ రంగ కార్మికుల మండల అధ్యక్షుడు ఆనందం, నాయకులు మాసయ్య, అంజయ్య, సంజీవులు, శ్రీనివాస్, కమలబాయి, శంకర్, మల్కయ్య, గంగయ్య, నర్సింలు, జయసింగ్, విశ్వనాథం, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు క్షమాపణ చెప్పాలి

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వ్యవహార శైలిబాధాకరం
- ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన నాయకులు

కుల్కచర్ల: గిరిజనులపై ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర పేర్కొన్నారు. శనివారం కుల్కచర్లలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మాజీ కార్పొరేటర్ సుజాతను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వెంటనే గిరిజనులకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. దొరల అహంకార ధోరణిని మార్చుకోకపోతే రానున్న కాలంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్ నాయక్, విఠల్ నాయక్, నరసింహ నాయక్, రవినాయక్, సాల్విడు విఠల్, రాంచందర్, విష్ణు, రవి, వినోద్, గోవర్ధన్, శ్రీనునాయక్, రఘు, హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో మొసలి కలకలం

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై మొసలి ఉందంటూ వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ అవుతుంది. అయితే ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి కొందరు పొలాలకు వెళ్తున్న వారికి దౌల్తాబాద్ చెరువు కట్టపై మొసలి కనిపించింది. దీంతో వారు బైక్ వెలుతురులో ఫోన్‌లో వీడియో తీశారు. అనంతరం మొసలి చెరువులోకి వెళ్లినట్లు తెలిపారు. ఈ విషయం శనివారం ఉదయం వాట్సప్ గ్రూపుల్లో దౌల్తాబాద్ చెరువులో మొసలి ఉందంటూ ప్రచారం కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయం ఫారెస్టు బీట్ అధికారి రాంరెడ్డిని అడగ్గా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. విషయం తెలుసుకుని పరిశీలిస్తామన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి

పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి



ఈశ్వరప్పను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయం ప్రారంభమై 41రోజులు పూర్తయిన సందర్భంగా హోమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పొచన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్, రవీందర్, కాశయ్య, శంకర్, మాంతయ్య, ప్రేంకుమార్, మఠం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం

ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సహాయసహకారం అందిస్తానని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలో అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ. లక్ష ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు సనాతన ధర్మాన్ని కాపాడటంలో యువత ముందుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర టెలికాం కమిటీ సభ్యులు ఘనపురం వెంకటయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్యముదిరాజ్, జిల్లా కార్యవర్గసభ్యుడు గాదె మైపాల్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు రవిచందర్, చందు, ప్రభునాయక్, శ్రీనివాస్ రెడ్డి, మహేష్, పెరుమాళ్ల వెంకటేశ్, మహేశ్ నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వమత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటనాగిరెడ్డి



ఇఫ్తార్ విందులో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశ్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి

దోమ: ఇఫ్తార్ విందు సర్వమత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొప్పుల వెంకటనాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సైద్‌పల్లి షఫీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో మత విద్వేషాలకు తావులేకుండా హిందూ, ముస్లింలు కలిసి మెలసి ఉండాలన్నారు. ఇఫ్తార్‌ను ప్రతిఒక్కరూ ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశ్, సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు హన్మంతునాయక్, మాజీ ఎంపీటీసీలు రాఘవపురం రాములు, నవాజ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మోహిన్, తాహెర్, రహెం, ఖలీల్, రియాజ్, బుక్క పాష, మైను, చాంద్‌పాష, తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదయ్య, రమాదేవి

యాలాల: బాటసారుల దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని పంచాయతీ అధికారి యాదయ్య, గ్రామ కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో అగ్గనూరు పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాటసారులు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: బాలంపేట, నర్సీపూర్, సురాయిపల్లి గ్రామాల్లోని సబ్‌స్టేషన్లలో ఆదివారం మరమ్మతుల నిమిత్తం మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

◆ వ్యవసాయరంగానికి మొండిచేయి

కొడంగల్ రూరల్: బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంటి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాలకులు ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసం ఆశాజనకమైన హామీలిస్తూ అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి, రైతాంగానికి తీవ్ర అన్యాయం చేశారని గుర్తు చేశారు. వ్యవసాయ రంగానికి చేసిన కేటాయింపులను పునర్ సమీక్షించి మలిదశ నిధులను కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

◆ రాకంచర్ల ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

పూడూరు: మండల పరిధిలోని శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి ఆలయాన్ని అభివృద్ధి పరుస్తానని డీసీసీ కార్యదర్శి పెంటయ్య అన్నారు. శనివారం ఆయన ఆలయ ప్రాంగణంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో మౌలిక సదుపాయాలను కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదనంగా మరో రూ.10లక్షలు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరామని తెలిపారు.

◆ పేదలకు రంజాన్ కిట్ల పంపిణీ

అనంతగిరి: పేద ముస్లింలకు రంజాన్ కిట్లను శివారెడ్డిపేట ప్రముఖ వ్యాపారవేత్త సయ్యద్ ఇక్బాల్ ఆయన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం సంపాదించిన దాంట్లో పేద వారికి కొంత సహాయం చేయాలన్నారు. ఈ సంవత్సరం 1000 రంజాన్ కిట్లను పంపిణీ చేశారన్నారు. ఈ కిట్లలో 10 రకాల ఆహార సామగ్రి ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ వారికి తోచిన విధంగా సహాయం చేయాలని కోరారు.

◆ యాదవులు అభివృద్ధి చెందాలి

దోమ: యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షుడు నర్సింహా యాదవ్ తెలిపారు. శనివారం దోమ మండల పరిధిలోని బడేంపల్లి గ్రామంలో అఖిల భారత యాదవ సంఘం నూతన గ్రామ కమిటీని ఆయన ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా అంజియాదవ్, ఉపాధ్యక్షుడిగా రాజుయాదవ్, ప్రధానకార్యదర్శిగా ఆనంద్‌యాదవ్, కార్యదర్శిగా మల్కయ్య యాదవ్, కోశాధికారిగా శ్రీనివాస్ యాదవ్, ఇతర సభ్యులను ఆయన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ ఇంటి నంబర్లు కేటాయించండి

పరిగి: మున్సిపల్ పరిధిలోని తుంకల్‌గడ్డలో ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అధికారులను కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యకు ఇంటి నంబర్లు, విద్యుత్, తాగునీటి కనెక్షన్లను ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంకల్‌గడ్డలో కొన్ని సంవత్సరాల నుంచి నిరుపేద కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఇంటి నంబర్లు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు స్పందించి ఇంటి నంబర్లను కేటాయించాలని కోరారు. హబీబ్, అశోక్, మహబూబ్‌ఖాన్, జాకీర్, గఫార్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించేలా కార్యాచరణ ఉండాలి

అదనపు కలెక్టర్ సుధీర్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇచ్చి వారి ఆర్థిక ఎదుగుదలకు కార్యాచరణ రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. శనివారం తన చాంబర్‌లో జిల్లాస్థాయి స్కిల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ చైర్మన్‌గా 16మంది సభ్యులతో జిల్లాస్థాయి కమిటీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ నిరుద్యోగ యువతకు ఉపాధి లభించేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు పని చేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లేశం, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, ఎస్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి కమాలాకర్‌రెడ్డి, క్రీడల శాఖ జిల్లా అధికారి హనుమంతరావు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

కొత్తూరు: సిద్ధాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంఈఓ అంగూర్‌నాయక్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు బాధాకరం



తాండూరు టౌన్: పోలీసుల అదుపులో బీఆర్ఎస్వీ నాయకులు

తాండూరు టౌన్: అసెంబ్లీ ముట్టడికి బీఆర్ఎస్ విద్యార్థి విభాగం పిలుపునివ్వడంతో తాండూరు పట్టణ పోలీసులు పలువురు నాయకులను శనివారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు జోగుల ఎబినేజర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక మోసం చేస్తుందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి సంఘాలపై ఆంక్షలు విధించడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, పట్టణ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, రజక నర్సింహులు, వినోద్ కుమార్ తదితరులు అరెస్టయిన వారిలో ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

పరిగి: అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన సందర్భంగా వారికి ఆయన మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి తలమాణిక్యమైన ఉస్మానియ యూనివర్సిటీకి సర్క్యులర్‌తో సంకెళ్లు విధించారన్నారు. ఆ సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, జగన్, బీఆర్ఎస్వీ నాయకులు జాక్ రవికుమార్, బాలాల, రఘువీర్, హరి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్ ఉద్యోగం సాధించిన శశివర్ధన్‌కు సన్మానం



శశివర్ధన్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

దుద్యాల్: గ్రామానికి చెందిన వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే గ్రామానికే గొప్పతనం. ఉద్యోగం సాధించిన వ్యక్తికి గ్రామస్థులు అందరు కలిసి సన్మానం చేయడం అరుదుగా చూస్తుంటాం. దుద్యాల్ గ్రామంలో ఎవరికి ఉద్యోగం వచ్చినా అందరు కలిసికట్టుగా సన్మానం చేయడం ఇక్కడి ఆనవాయితి. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో గ్రామానికి చెందిన మాసుల శశివర్ధన్‌కు హాస్టల్ వార్డెన్ ఉద్యోగం వచ్చింది. ఈ సందర్భంగా గ్రామస్థులందరూ ఆయనకు గ్రామ పంచాయతీ దగ్గర సన్మానం చేశారు. ఇలా గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేకతను మండల వాసులు చాలా మంది గ్రామస్థులను అభినందిస్తున్నారు. ఇదే సంస్కృతి అన్ని గ్రామాల్లో కొనసాగితే చాలా బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.